ప్రజాశక్తి

శనివారం 21 జూన్ 2025 | 5 | విజయనగరం




క్యాంపస్ డ్రైవ్‌లో 197 మంది ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో 16 కంపెనీలతో శుక్రవారం లెర్నింగ్ ట్రీ ఆర్గనైజేషన్, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. 492 అభ్యర్థులు హాజరు కాగా, వారికి రాత పరీక్ష, టెక్నికల్ రౌండ్, ఇంటర్వ్యూ నిర్వహించి 197మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ ఎంపిక ప్రక్రియను వివిధ కంపెనీల హెచ్ ఆర్‌లు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ విద్యార్థులకు ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, అందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. సత్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవమణి మాట్లాడుతూ విద్యార్థులకు మరిన్ని అవకాశాలను కల్పిస్తామని, నైపుణ్యాలను పెంచుకొని సిద్ధంగా వుండాలని అన్నారు.

'సుఖీభవ'కు నోచని 33వేల మంది రైతులు

- తహశీల్దార్ల వద్ద 74,301 మంది రైతుల జాబితా పెండింగ్
- ఆందోళనలో అన్నదాతలు



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గత ప్రభుత్వం అమలు చేసిన రైతుభరోసా లబ్ధిదారుల సంఖ్యతో పోలిస్తే జిల్లాలో సుమారు 33వేల మంది రైతులు అన్నదాత తాజాగా కూటమి ప్రభుత్వం ప్రకటించిన సుఖీభవ పథకానికి నోచుకోలేదు. దాదాపు 74,311 మంది రైతుల జాబితాను వివిధ కారణాల పేరిట పెండింగ్‌లో ఉంచారు. దీంతో, సాయానికి నోచుకోని కర్షక కుటుంబాలన్నీ ఆందోళన చెందుతున్నాయి.

గతంలో వైసిపి ప్రభుత్వం కేంద్రం పిఎం కిసాన్ పేరిట చెల్లించే రూ.6 వేలతో పాటు రూ.7,500 చెల్లించేది. ఈ లెక్కన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సగటు రైతుకు రూ.13,500 వరకు అందేది. ఎన్నికల హామీల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు చెల్లిస్తామంటూ కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసిన సంగతి తెలిసిందే. దీన్ని గత ఏడాది అమలు చేయలేదు. ఒత్తిడి పెరగడంతో ఇటీవల లబ్ధిదారుల జాబితాను ప్రకటించింది. దీని ప్రకారం జిల్లా వ్యాప్తంగా 4,89,108 మంది రైతులు తమ భూముల వివరాలను ఆధార్ నెంబర్‌కు అనుసంధానం చేసుకున్నారు. ఇందులో 2,26,942 మంది మాత్రమే అర్హులుగా ఎంపిక చేశారు. 74,311 మంది రైతుల జాబితా తహశీల్దార్ల లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిశీలన అనంతరం అర్హులకు సుఖీభవ పథకం వర్తించే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. మరో 5,260 మందికి ఇకెవైసి పెండింగ్‌లో ఉన్నట్టు అధికారులు లెక్కలు చూపుతున్నారు. మిగిలిన రైతులందర్నీ తిరస్కరించినట్టే లెక్క. ప్రభుత్వం విడుదల చేసిన అన్నదాత సుఖీభవ జాబితాలో చాలా మంది రైతుల పేర్లు లేకపోవడం తార్కాణంగా చెప్పుకోవచ్చు. నెల్లిమర్ల మండలం గరికిపేటకు చెందిన మహంతి రాజ్యలక్ష్మికి 1.50సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా పేరిట రూ.7,500, పిఎం కిసాన్ పథకంలో భాగంగా రూ.6వేలు కలుపుకుని ఏటా రూ.13,500 అందేవి. గడిచిన ఫిబ్రవరి నెలలో కూడా రూ.2వేలు బ్యాంకు ఖాతాలో పడ్డాయి. కానీ, ప్రస్తుతం విడుదల చేసిన అన్నదాత సుఖీభవ జాబితాలో అనర్హుల జాబితాలో ఉంది. ఎకరన్నర భూమి విజయలక్ష్మికి తన పూర్వికుల నుంచి వంశపారం పర్యంగా వచ్చినప్పటికీ 10సెంట్లలోపు భూమి ఉన్నట్లు చూపి, పథకం వర్తించబోదంటూ వెబ్‌సైట్‌లో పేర్కొనడం గమనార్హం. ఇది కేవలం రాజ్యలక్ష్మి సమస్య మాత్రమే కాదు. ఇటువంటి తప్పులు తడకల రికార్డులతో ఎంతో మంది రైతులు పథకానికి దూరమయ్యారు. కొత్తగా కొనుక్కున భూమి రికార్డుల్లో సరిగా నమోదు కాకపోవడం వల్ల కూడా చాలా మంది నష్టపోయారు. తాము కొనుకున్న భూములు ప్రభుత్వం ఇంకా ఆన్‌లైన్ చేయకపోవడం వల్ల నష్టపోయామంటూ లబోదిబోమంటున్నారు.

మూడు దఫాలుగా అన్నదాత సుఖీభవ

అన్నదాత సుఖీభవ పేరిట రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.14వేలు, కేంద్రం తరపున ఎప్పటి మాదిరిగా రూ.6వేలు కలిపి ఏడాదికి రూ.20వేల సాయాన్ని అందజేయాల్సివుంది. కేంద్ర చెల్లిస్తున్న రూ.6వేలు జనవరి నుంచి ఫిబ్రవరి మధ్యలో రూ.2వేలు, మే, జూన్ నెలల్లో రూ.2వేలు, అక్టోబర్, నవంబర్ నెలల్లో రూ.2వేల చొప్పున చెల్లిస్తున్న సంగతి తెలిసిందే. దీని ప్రకారం గత ప్రభుత్వం తరపున చెల్లించిన రూ.7,500లో జనవరి, ఫిబ్రవరిలో రూ.5,500వేలు, మే, జూన్ నెలల్లో రూ.2వేల చొప్పున చెల్లించేది. ఈసారి ఈ మొత్తం 14వేలకు పెరగడంతో మొదటి రెండు దఫాల్లో రూ.5వేల చొప్పున, మూడో ఇనిస్టాల్ మెంట్‌లో రూ.4వేలు చెల్లించనున్నట్టు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. పది సెంట్లలోపు, ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లిస్తున్నవారికి, ప్రభుత్వ ఉద్యోగులకు ఈ పథకం వర్తించబోదని ప్రభుత్వ నిబంధనలు చెబుతున్నాయి.

5వేల మందితో నేడు యోగా సాధన

రాజీవ్‌క్రీడా మైదానంలో ఏర్పాట్లు : కలెక్టర్ అంబేద్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్/విజయనగరంటౌన్

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడా మైదానంలో ఉదయం 7 గంటల నుండి 8వరకు 5వేల మందితో యోగా కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశాఖలో హాజరయ్యే యోగాంధ్ర కార్యక్రమానికి యోగసాధకులు, విద్యార్థులు, ప్రజలను నిర్ణీత సమయానికే గమ్యం చేరుకునేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఛాంబర్ నుండి శుక్రవారం ఎంపిడిఒలు, లైజనింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 5775 కేంద్రాల్లో యథావిధిగా ఉదయం 7 నుండి 8 వరకు అంతజాతీయ యోగ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 10లక్షల మంది పాల్గొంటారని తెలిపారు. సచివాల యాల్లో, పాఠశాల, ఇతర సంస్థల వద్ద ఈ యోగా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

అశోక్ బంగ్లాలో యోగాసనాలు

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయడంలో సన్నాహకంగా శుక్రవారం పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు యోగా కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న ఎమ్మెల్యే అదితి, కార్యకర్తలు

కార్యక్రమంలో టిడిపి నాయకులు ఐవిపి రాజు, ప్రసాదుల లక్ష్మి వర ప్రసాద్, బొద్దల నరసింగరావు, ఆల్తి బంగారుబాబు, గంటా పొలినాయుడు, అనురాధ బేగం, కర్రోతు నరసింగ రావు, కర్రోతు రాధామని, గంటా రవి,రమేష్, మాతా బుజ్జి, గోలగాని సురేంద్ర, పత్తి గుల్ల సూర్య కుమారి , నారాయనప్పుడు, తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి : కమిషనర్

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పిలుపునిచ్చారు. జీవితంలో యోగాను అంతర్భాగంగా చేసుకుని, సంపూర్ణ ఆరోగ్యాన్ని పరిపుష్టం చేసుకోవాలని సూచించారు. యోగా సాధన ద్వారా మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని తద్వారా మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని చెప్పారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని రాజీవ్ స్టేడియం వద్ద పెద్ద ఎత్తున యోగాంధ్ర కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 5వేల మందితో యోగాసనాలు వేసే ప్రక్రియలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థలు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొంటారని తెలిపారు. ఉదయం 6:30 గంటలకు రాజీవ్ స్టేడియంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించిన అనంతరం ర్యాలీ కూడా ఉంటుందన్నారు. ముఖ్యంగా మొక్కలు నాటడం, సామూహిక పారిశుధ్య విధానాలు చేపట్టడం, వర్షపు నీటి సంరక్షణ చర్యలు, ఇంకుడు గుంతల పునరుద్ధరణ, కార్యాలయాలు పరిశుభ్ర పరిచే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.



మారిక గ్రామంలో చెట్టు కింద చదువు చెబుతున్న ఉపాధ్యాయుడు

చెట్ల కిందే పాఠాలు

వేపాడ మండలం కరకవలస పంచాయతీ పరిధి మారిక గిరిజన గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవనం నిర్మించకపోవడంతో విద్యార్థులకు చెట్ల కిందే చదువు చెప్పాల్సిన దుస్థితి నెలకొంది. ఓవైపు కార్పొరేట్ విద్యావ్యవస్థకు ధీటుగా ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్నామని చెబుతున్న పాలకులు గిరిజన ప్రాంతాల్లో పాఠశాలల పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని చెప్పడానికి ఈ దృశ్యమే నిదర్శనం. దీంతో ఉపాధ్యాయులు ఆరుబయట చెట్ల కిందే పిల్లలకు పాఠాలు చెబుతున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో భవన నిర్మాణానికి నిధులు మంజూరు అయినప్పటికీ అప్పటి ప్రజాప్రతినిధులు నిర్మాణం చేపట్టకుండా అశ్రద్ధ చేశారు. నిర్మాణానికి మంజూరైన ఇనుము, సిమెంటు కరకవలస ఎంపిపి పాఠశాలలోనే నిల్వ ఉండిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా భవన నిర్మాణం ప్రారంభించలేదు. ప్రభుత్వాలు మారుతున్నా గిరిజనుల అభివృద్ధి మాటల్లో తప్ప ఆచరణలో కానరావడం లేదు.

\- ప్రజాశక్తి, వేపాడ

యోగా మోజులో సంగీతానికి 'తాళం'

- నేడు యోగా, సంగీతం అంతర్జాతీయ దినోత్సవాలు
- సమ ప్రాధాన్యతను ఇవ్వని ప్రభుత్వాలు
- యోగాసనాల పేరిట విశాఖకు 30వేల మంది తరలింపు
- బోసిపోయిన సంగీత నృత్య కళాశాల





ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

యోగా మంచిదా? సంగీతం మంచిదా? అంటే రెండింటిలో దేనికదే ప్రాధాన్యమైనవని కొందరూ, దేని ప్రాధాన్యత దానికి ఉందని మరికొందరు, యోగాకు సంగీతమేమీ తీసుపోదని ఇంకొందరు చెప్తున్నారు. కానీ, నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం యోగా మోజులోపడి సంగీతాన్ని పూర్తిగా గాలికి వదిలేశాయి. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంతోపాటు ప్రపంచ సంగీత దినోత్సవం కూడా. కానీ, నెలరోజుల నుంచి యోగాంధ్రపేరిట జిల్లాలోని అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు మునిగితేలుతున్నారు. ప్రపంచ సంగీత దినోత్సవం శనివారం ఒక్కరోజున కూడా కనీసం ఒక సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించకపోవడమే ఇందుకు తార్కాణంగా చెప్పకోవచ్చు.

యోగా శారీరక ఆరోగ్యానికి దోహదడుతుందనడంలో సందేహం లేదు. మొదడును సన్మార్గంలో నడిపిస్తుందని కూడా చెబుతుంటారు. ఈనేపథ్యంలో దీన్ని ప్రోత్సహించాలను కుంటే గ్రామాలు, పట్టణాల్లో అందుకు తగ్గ వసతులు కల్పిస్తే సరిపోతుంది. పాఠశాలల్లో డ్రిల్లు మాస్టర్ పోస్టులను కూడా వేయాల్సిన అవసరం ఉంటుంది. తద్వారా ఆటపాటలతో పాటే యోగాను చిన్నప్పటి నుంచే అలవాటు చేయవచ్చు. కానీ, ప్రభుత్వం ఆ పని చేయడం లేదు. పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులను భర్తీ చేయడం లేదు. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి నెలరోజులు ముందు నుంచే జిల్లాలో ఎక్కడబడితే అక్కడ యోగా శిక్షణా శిబిరాలు నిర్వహించారు. ముసలిముడగ, చిన్నపెద్ద, రైతులు, గృహిణులు అనే తేడా లేకుండా బలవంతంగా శిబిరాలకు తరలించి యోగాసనాలు వేయించారు. ప్రధాని మోడీని ప్రసన్నం చేసుకునేందుకు మన జిల్లా నుంచి 30వేల మందిని విశాఖకు తరలించారు. ఇందుకోసం రూ.కోట్లు ఖర్చుచేశారట. ఇందులో అధికారులు, ఉద్యోగుల కష్టనష్టాలు, ప్రజలు స్పందించిన తీరు కాస్త పక్కనబెడితే.... యోగా ద్వారా జీవన శైలి మెరుగు పడుతుందని అనుకున్నప్పుడు బలవంతంగా చేయించినా తప్పేమీ లేదు. కానీ, అదే యోగా అంతర్జాతీయ దినోత్సవం రోజున నిర్వహించాల్సిన ప్రపంచ సంగీత దినోత్సవాన్ని ఎందుకు నిర్వహించలేదన్నదానిపై జిల్లాలో సర్వత్రా చర్చనడుస్తోంది. ఇందుకు కారణం లేకపోలేదు. 2015లో మొదలైన యోగాకే ఇంత ప్రాధాన్యత ఇచ్చినప్పుడు 1982లో మొదలైన సంగీత దినోత్సవానికి ఎంత ప్రాధాన్యత ఇవ్వాలి? అంటూ ప్రశ్నించిన వారు కూడా లేకపోలేదు. ఒక్క మానవాళిని మాత్రమే కాదు, సమస్త జీవరాసులను స్పందింపజేసే శక్తి సంగీతానికి ఉంది. సంగీతం వినకపోతే మానసిక ప్రశాంతతే లేదని చెబుతున్న వారూ కోకొల్లలుగా ఉన్నారు. జాతి, కుల,మత, ప్రాంతం అనే తేడా లేకుండా సగటు మనిషిని కలిపే సామర్థాలు కూడా ఉన్నాయి. ఇంతటి సంగీతానికి విజయనగరం జిల్లా పుట్టినిల్లు వంటిది. మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల దక్షిణ భారతదేశంలోనే మొదటిదిగా పేరు గాంచింది. గాన కోకిల సుశీల, సినీ సంగీత దర్శకుడు సాలూరు రాజేశ్వరరావు, ఘంటశాల, హరికథ పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు, వయొలిన్ విద్వాంసులు ద్వారం వెంకటస్వామినాయుడు, దుర్గాప్రసాద్ వంటివారెందరో ఇక్కడి నుంచి ఎదిగినవారే. వీరంతా ప్రపంచ దేశాల్లో మన దేశపు సంగీత సుగంధాలను వెదజల్లారు. ఇంతటి ప్రాధాన్యతగల జిల్లాలో ప్రపంచ సంగీత దినోత్సవాన్ని ఎలాగూ నిర్వహించలేదు. కనీసం కళాశాల తాళం కూడా తెరుచోని పరిస్థితి దాపురించింది. ఈనేపథ్యంలో యోగాకు ఇచ్చిన ప్రాధాన్యత సంగీతానికి ఇవ్వకపోవడం గర్హనీయమని జనం చెప్పుకుంటున్నారు.



డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తిని సన్మానిస్తున్న కలెక్టర్, రెవెన్యూ అసోసియేషన్ నాయకులు

రెవెన్యూ ప్రతిష్టను పెంచాలి

కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రెవిన్యూశాఖ ప్రతిష్టనుపెంచేలా అధికారులు చట్టాలపై అవగాహన కలిగి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. రిటైర్డు అయిన ఉద్యోగుల అనుభవాలను తెలుసుకొని సమర్థతను పెంచుకోవాలని తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో రెవిన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ క్రమశిక్షణ, చిత్త శుద్ధితో పనిచేస్తే ఉన్నతాధికారుల నుండి, ప్రజల నుండి ప్రసంశలు అందుకుంటారని, వృత్తిపరమైన సంతృప్తి లభిస్తుందని తెలిపారు. ప్రధానంగా యువ ఉద్యోగులు పలు అంశాలపై అవగాహన పెంచుకొని వారి నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలని దిశా నిర్దేశం చేసారు. ఈ సందర్భంగా అటెండర్ నుండి డిప్యూటీ కలెక్టరు వరకు రిటైర్డు అయిన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ శ్రీనివాస మూర్తి, ఆర్‌డిఒలు ఆశయ్య, రామ్మోహన్‌రావు, విశ్రాంత డిఆర్‌ఒ గణపతి రావు, రెవిన్యూ అసోసియేషన్ ప్రతినిధులు తాడ్డి గోవింద , మాజీ ప్రతినిధులు పేడాడ జనార్ధన్ రావు, రెవిన్యూ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మిగులు సీట్లు కోసం దరఖాస్తులు

ప్రజాశక్తి - బొబ్బిలి

ప్రభుత్వ ఐటిఐలో మిగులు సీట్లు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండో విడత కౌన్సిలింగ్ కోసం ఈనెల 19 నుంచి జూలై 15 ఉదయం 11.55 గంటలులోగా iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. బొబ్బిలి ప్రభుత్వ ఐటిఐలో ఎలక్ట్రిసియన్, ఫిట్టర్, టర్నర్, మిషనిస్టు, డ్రాఫ్ట్ మెకానిక్, డీజిల్ మెకానిక్, వెల్డర్ ట్రేడ్‌లలో సీట్లు భర్తీ చేయనున్నట్లు చెప్పారు.

మద్యం దుకాణం మాకొద్దు

- మార్చివేయాలని మహిళల నిరసన
- దుకాణాన్ని మూసివేసి, వంటావార్పు



ప్రజాశక్తి- బొండపల్లి

మండల కేంద్రంలోని యాతవీధి వద్ద ఉన్న మద్యం దుకాణాన్ని అక్కడ నుంచి తొలగించాలని యాతవీధి మహిళలు, గీత కార్మికులు శుక్రవారం మద్యం దుకాణం ముందు ధర్నా చేసి దుకాణాన్ని మూసివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ వీధిలో ఈ మద్యం దుకాణం ఉండటం వల్ల యువకులు, చిన్న పిల్లలు మద్యానికి బానిసలవుతున్నారన్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు యువకులు కూడా ఈ మద్యం దుకాణం వద్దే మద్యం తాగి చెట్టును ఢీకొని మృతి చెందారన్నారు. ఐదు నెలల ముందు ఈ దుకాణాన్ని ఇక్కడ నుంచి తొలగించాలని ఎక్సైజ్ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అయినా ఇంత వరకూ సంబంధిత అధికారులు పట్టించుకోలేదన్నారు. ఈ దుకాణం ముందు నుంచి తమటాడ, గొల్లలపేట, ముద్దూరు గ్రామాలకు చెందిన పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు వెళ్లేటప్పుడు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా మద్యం దుకాణం ఇక్కడి నుంచి మార్చకపోతే పెద్ద ఎత్తున నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎక్సైజ్ సిఐ జె. జనార్ధనరావు, ఎస్ఐ నరేంద్రకుమార్ ఘటనా స్థలానికి చేరుకుని నిరసన కారులతో మాట్లాడారు. ఇప్పటికిప్పుడు ఇక్కడ నుంచి దుకాణం మార్చివేయడం సాధ్యం కాదనీ, కనీసం రెండు మూడు వారాలు పట్టే అవకాశం ఉందని చెప్పారు. దీనికి బదులుగా మహిళలు మాట్లాడుతూ ఐదు నెలల నుంచి చెబుతున్నా పట్టించుకోని మీరు రెండు మూడు వారాల్లో దుకాణాన్ని మార్చివేస్తామంటే నమ్మడం ఎలా అని దీనిక బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. సిఐ మాట్లాడుతూ బాధితులు ఇచ్చిన ఫిర్యాదును పై అధికారులకు పంపిస్తామన్నారు. సిఐ చెప్పిన మాటలపై నమ్మకం లేని మహిళలు అక్కడే బైటాయించి వాంటావార్పు నిర్వహించి, టెంట్లు వేసుకుని నిరసన తెలుపుతున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బండారు బంగారం, టిడిపి నాయకులు చలుమూరి మూర్తి, మాజీ ఎంపిటిసి శ్రీను, చిరంజీవి రాజు, ముద్దూరు మాజీ సర్పంచ్ కల్యాణపు నారాయణరావు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

వైసిపి కౌన్సిలర్ల నిరసన

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ కార్యాలయం వద్ద సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన కుర్చీలను తీసివేయడంతో శుక్రవారం వైసిపి కౌన్సిలర్లు నిరసన తెలిపారు. మున్సిపల్ కార్యాలయానికి వివిధ సమస్యలపై వస్తున్న ప్రజల కోసం వేసిన కుర్చీలను తొలగించడం సరికాదని వైసిపి కౌన్సిలర్లు చోడిగంజి రమేష్ నాయుడు, పి.ఉమాశంకర్, ఎస్.రామకృష్ణబాబు, ఇంటి గోవిందరావు, మాజీ వైస్ చైర్మన్ జి.రమాదేవి అన్నారు. పాత పద్ధతిలో కుర్చీలు వేయాలని డిమాండ్ చేశారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కౌన్సిలర్లు

బస్సులు లేక ఖాళీగా ఉన్న ఆర్‌టిసి కాంప్లెక్సు



బస్సులు లేక ప్రయాణికుల పాట్లు

- ఖాళీగా దర్శనమిస్తున్న ఆర్‌టిసి కాంప్లెక్స్
- ప్రయివేటు వాహనాల ఛార్జీల బాదుడు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న యోగా కార్యక్రమంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. విశాఖలో నిర్వహిస్తున్న యోగా కార్యక్రమానికి జిల్లా నుంచి 30వేల మందిని తరలిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. వీరి కోసం సుమారు 6వందల బస్సులను వేశారు. జిల్లాలోని అన్ని డిపోలు, పాఠశాలల నుంచి బస్సులనే కాకుండా ఇతర జిల్లాల నుంచి సైతం బస్సులు రప్పించారు. ఈనేపథ్యంలో వివిధ ప్రాంతాలకు జిల్లా నుంచి ప్రయాణం చేసే వారికి శుక్రవారం ఉదయం నుంచి కష్టాలు తప్పలేదు. విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సులో గంటల తరబడి వేచి చూసిన ప్రయాణికులు బస్సులు లేక అగచాట్లు పడ్డారు. ఎప్పటికీ రావని తెలుసుకొని ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సులన్నింటినీ విశాఖ తరలిస్తున్న అధికారులు ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ప్రకటన ఇవ్వకపోవడం పట్ల ప్రజలంతా మండిపడుతున్నారు. ఇదే అదునుగా ప్రైవేటు వాహనదారులు ప్రయాణికులనుంచి అధిక మొత్తంలో ఛార్జీలు వసూలు చేశారు.



ఆర్‌టిసి కాంప్లెక్సులో వేచి ఉన్న ప్రయాణికులు

నిబంధనల మేరకు చేసిన పనులకే నిధులు

ప్రజాశక్తి - వేపాడ

నిబంధనల మేరకు చేసిన పనులకే నిధులు మంజూరవుతాయని ఎంపిడిఒ సిహెచ్. సూర్యనారాయణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి డి. సత్యవంతుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా సభ్యులు మాట్లాడుతూ మండల పరిషత్ నిధుల నుండి మంజూరైన పనులకు బిల్లులు చెల్లించకపోవడానికి గల కారణాలు చెప్పాలని డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన ఎంపిడిఒ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో తాగునీటి బోరులు తీయటానికి, సిసి రోడ్లు వేయడానికి వేసిన ఎస్టిమేషన్లు తన వరకూ చేరకుండా నిబంధన మేరకు తాను ప్రొసీడింగ్ ఇవ్వకుండా పిఆర్ జెఇ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇలు ఇచ్చిన ప్రాప్తికి చేసిన పనులకు ఏ విధంగా తాను బిల్లులు పెట్టగలనని చెప్పారు. సర్పంచులు ఎంపిటిసిలు తాను చెప్పేది అర్థం చేసుకోవాలని కొంత మంది దిగువ స్థాయి అధికారులు తప్పుడు విధానం వల్ల చేసిన పనులకు బిల్లులు చేయడం ఇబ్బందిగా మారిందని చెప్పారు. ఇప్పటికైనా పనులకు సంబంధించిన ఎస్టిమేషన్ కాపీలు తన వద్దకు వస్తే పరిశీలించి బిల్లులు చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. బాణాది ఎంపిటిసి గొంప తులసి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా తమకు బిల్లులు అవ్వలేదని అడిగారు. వావిలిపాడు సర్పంచ్ బీల రాజేశ్వరి, సోంపురం ఎంపిటిసి ఆకుల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలకు ఏ విధమైన అభివృద్ధి పనులూ చేయకపోవడం వల్ల గ్రామాల్లో ప్రజలకు సమాధానం చెప్పుకోలేకపోతున్నామని ఇప్పటికైనా తాము చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయాలని కోరారు. వైస్ ఎంపిపి ఈశ్వరరావు మాట్లాడుతూ ఇంతవరకు గతంలో ఇక్కడ పనిచేసిన ఎంపిడిఒలు ఎవరు కూడా ఈ విధంగా మాట్లాడలేదని మీరే కొత్త పద్ధతులు తీసుకు వస్తున్నారని ఎంపిడిఒను ఉద్దేశించి అసహనం వ్యక్తం చేశారు. అందుకు ఎంపిడిఒ బదులిస్తూ నిబంధనలను తాను ఉల్లంఘించని విధి నిర్వహణలో తప్పు చేయలేనని సమాధానం చెప్పారు. అనంతరం శాఖల వారీగా గత సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పారు. సమావేశంలో మండల స్థాయి అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో ఎంపిడిఒ



మాట్లాడుతున్న ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ

పేపర్లో వార్త వస్తే పనులు ఆపేస్తారా?
ఇరిగేషన్ ఎఇపై మండిపడ్డ సర్పంచ్ రాజేశ్వరి



ఎఇని నిలదీస్తున్న సర్పంచ్ రాజేశ్వరి

పత్రికల్లో వార్త వస్తే పనులు ఆపేస్తారా అని వావిలపాడు సర్పంచ్ బీల రాజేశ్వరి ఇరిగేషన్ ఎఇ హనుమంతరావుపై మండి పడ్డారు. గ్రామపంచాయతీ ఆమోదం మేరకు ప్రజా ప్రయోజనాల దృష్ట్యా గ్రామపంచాయతీ నిధులతో సిసి రోడ్డుకు పిఆర్‌జెఇ అలీ ఎస్టిమేషన్ ప్రకారం నిర్మాణం పనులు చేపట్టామన్నారు. ఈ రోడ్డు నిర్మాణంపై ఒక పత్రికలో వచ్చిన కథనానికి ఇరిగేషన్ ఎఇ బిల్లులు చెల్లించుకుంటూ ఆటంకం పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గ్రామస్తులు, రైతుల కోరిక మేరకే ఆ రోడ్డు వేశాం. కనీసం పరిశీలనకు రాని ఎఇ బిల్లులను ఎలా పెండింగ్‌లో పెడతారని ఆగ్రహించారు. దీనిపై ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం కోర్టులో వేసి న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు.

వరి విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని అక్కివరం గ్రామంలో శుక్రవారం వరి విత్తనాలను ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావు రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఒ సంగీత, అక్కివరం సర్పంచ్ కంది కిరణ్, ఉప సర్పంచ్ కంది సత్యనారాయణ, టిడిపి నాయకులు కంది సురేష్, రైతులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం

ప్రజాశక్తి - కొత్తవలస

యువత మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ సిఐ జి.ఎస్. రాజశేఖర్ నాయుడు అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని భారతి డిఫెన్స్ అకాడమీలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. మాదకద్రవ్యాలకు యువత బానిసయితే జరిగే నష్టాలు, దాని వల్ల దేశానికి జరిగే నష్టం గురించి వివరించారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలతో యువత పట్టుబడితే చట్టపరమైన శిక్షలు గురించి కూడా వారికి చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, కాలేజీ యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు నెల్లిమర్లలో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఈ నెల 22న సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ జి. ప్రశాంత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సి.కె.ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బిటెక్, ఎంబిఎ పిజిలలో ఉత్తీర్ణత సాధించి వయస్సు 18 నుండి 35 సంవత్సరాల నిరుద్యోగ యువతి యువకులకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళా ఈనెల 22న ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మిమ్స్ సమీపంలో సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతుందని చెప్పారు. కాగా జాబ్‌మేళాకు 12 బహుళ జాతి కంపెనీలు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఎంపిక చేసుకుంటారన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్ సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, అడ్మిట్ కార్డుతో పాటుగా రెజ్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జెరాక్స్, 1 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటలకు జాబు మేళాకు హాజరు కావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు నెంబర్ 7995691295, టోల్ ఫ్రీ 9988853335 సంప్రదించాలని తెలిపారు.

ప్రభుత్వ ఐటిఐలో 23, 24న జాబ్ మేళా

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో ఈనెల 23, 24వ తేదీల్లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన షిరిడిసాయి ఎలక్ట్రికల్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్‌కు చెందిన హెటిరో ల్యాబ్ పరిశ్రమ యాజమాన్యాలు జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నాయన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, టర్నర్, మిషనిస్ట్, డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్ ట్రేడ్స్ పూర్తిచేసిన వారు అర్హులన్నారు. 18 నుంచి 26 ఏళ్ల లోపు అభ్యర్థులు జాబ్ మేళాకు అర్హులని, ఆసక్తి ఉన్నవారు అర్హత సర్టిఫికెట్లతో ఈనెల 23న ఉదయం 9గంటలకు ప్రభుత్వ ఐటిఐకు రావాలని కోరారు.

ప్రతి ఒక్కదానికీ బిల్లు ఉండాలి

ప్రజాశక్తి - బాడంగి

డీలర్లు రైతులకు అందించే ప్రతి ఒక్క వస్తువుకూ కచ్చితంగా బిల్లు ఇవ్వాలని ఎఒ గౌడ్ సూర్య ప్రకాష్ అన్నారు. స్థానిక సచివాలయంలో శుక్రవారం ఆయన మండలంలో ఉన్న ఎరువులు, విత్తనాల దుకాణాల డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అమ్మేటప్పుడు తప్పనిసరిగా బిల్ అందజేయాలని సూచించారు. విత్తనాలు డీలర్లు తప్పనిసరిగా విత్తనాల స్టాక్ వచ్చిన వెంటనే లాట్‌ల ఆధారంగా వాటికి మొలక శాతం పరీక్షలు నిర్వహించాలని అనంతరం రైతులకు అమ్మాలని సూచించారు. ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలు, అమ్మకాల వివరాలు, వాటి ధరలు వివరాలు బయట డిస్ప్లే బోర్డులలో నమోదు చేసి పొందుపరచాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎఇఒ సునీత, శరత్, రాంబాబు, విఎఎలు జయలక్ష్మి, సాయికుమార్, డీలర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల, కొండవెలగాడ, సతివాడ, రామతీర్థం, విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11కెవి వ్యవసాయ కనెక్షన్ పనులు కొనసాగుతున్నందున శనివారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని విజయనగరం టౌన్ డిఇఇ పి.త్రినాధరావు ప్రకటనలో తెలిపారు. నెల్లిమర్ల, సబ్ స్టేషన్ 33/11కెవి గుర్ల రూరల్ ఫీడర్, కొండ వెలగాడ సబ్ స్టేషన్ పారిశ్రామిక రూరల్ ఫీడర్, సతివాడ33/11కెవి సబ్ స్టేషన్ పరిధిలో రామతీర్థం 11కెవి రూరల్ ఫీడర్, ఒమ్మి రూరల్ ఫీడర్ పరిధిలో వ్యవసాయ కనెక్షన్ నిర్మాణ పనుల కొనసాగింపు, చెట్లు తొలగించడం, సాంకేతిక సమస్యలు పరిష్కారం కోసం, గరికిపేట, కొండ గుంపాం, పూతిక పేట, మొయిద, పారసాం, గెద్దపేట, మధుపాడ, పినతలిమి, పెదతలిమి, బొప్పడాం, వల్లూరు, బొద్దవలస బుచ్చన్నపేట, ఒమ్మి, మాల్యాడ, వెంకన్నపాలెం, గ్రామాలకు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని చాలని ఆయన కోరారు.

ఘనంగా రెవెన్యూ డే వేడుకలు

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ జె. రాములమ్మ ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రాములమ్మ మాట్లాడుతూ గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులతో పాటు మండల రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది కూడా విధి నిర్వహణలో భాగంగా అందుబాటులో ఉంటూ తమ వద్దకు వచ్చినవారికి సేవలను సక్రమంగా అందజేస్తూ మంచి పేరు సంపాదించుకోవాలన్నారు. ఎవరికైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, క్షేత్రస్థాయిలో సిబ్బందిపై ఆరోపణలు వస్తే శాఖా పరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించుకొని మంచి పేరు తెచ్చుకోవాలని ఆయన కోరారు.

'పరిశ్రమ వ్యర్థాలతో భూమి నాశనం'

ప్రజాశక్తి - పూసపాటిరేగ

తమ రెండెకరాల భూమిలో పరిశ్రమకు చెందిన హానికర వ్యర్థజలాలను వదిలేశారని మండలంలోని చోడమ్మ అగ్రహారం గ్రామానికి చెందిన అంబల్ల నారాయణమ్మ అనే రైతు శుక్రవారం ఎంపిడిఒకు రాధికకు సిఐటియు నాయకులు బచ్చల సూర్య నారాయణ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్థ జలాలు వేయడం వల్ల భారీగా పంట నష్టం జరగడంతో పాటు టేకు, తాటి, కాము వంటి విలువైన చెట్లు పూర్తిగా నాశనమయ్యాయని, పక్కనే ఉన్న పిల్లకాలువ ద్వారా వ్యర్థాలు చేరి ఆయకట్టు భూములకు ప్రమాదం ఏర్పడిందని ఆమె తెలిపారు. స్థానికులు డ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు తెలిపినా, తగిన చర్యలు గానీ నష్టపరిహారం గానీ ఇప్పటి వరకు అందలేదని ఆమె వాపోయారు. ఆమె విన్నపంతో పరిశ్రమ యాజమాన్యం, వాహన డ్రైవర్, ఓనర్‌పై కేసు నమోదు చేసి, తగిన న్యాయం చేయాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

నిరుద్యోగ యువతకు భృతి చెల్లించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

నిరుద్యోగ యువతకు భృతి చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు యుగంధర్, జిల్లా కార్యదర్శి కోట అప్పన్న డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి చెల్లించి ఎన్నికల హామీని అమలు చేయాలని కోరుతూ శుక్రవారం గంటి ప్రసాదం భవనంలో పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చినప్పటికి అమలు చేయడం లేదన్నారు. నిరుద్యోగ భృతి ఇచ్చి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

కెజిబివి సందర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట దగ్గర కస్తూరిబా బాలికలు వసతి గృహాన్ని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ శుక్రవారం సందర్శించారు. పిల్లలకు మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని సూచించారు. ఆయన వెంట ఎంఇఒ పి.బాల భాస్కరరావు, ఉపాధ్యాయులు, వసతి గృహం ప్రిన్సిపల్ కిరణ్మయి పాల్గొన్నారు.

రోడ్లు నిర్మించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి పూల్‌బాగ్ జంక్షన్ వరకు రోడ్డును శాశ్వతంగా నిర్మించాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పూల్ బాగ్ రోడ్డుపై గోతులను శుక్రవారం పరిశీలించారు. పూల్‌బాగ్ రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఉండడంతో ప్రజలు, వహనాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. రోడ్లుపై గోతులను పూడ్చి ప్రజా ధనాన్ని వృథా చేయకుండా శాశ్వతంగా నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆయనతో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ ఉన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

విజయనగరం లోని వి.టి.అగ్రహారానికి చెందిన టిడిపి నాయకుల బమ్మిడి పైడిరాజు (50) విశాఖలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు.పైడిరాజు ఈ నెల 15న నాతావలస ఫంక్షన్‌కి వెళ్లి తిరిగి బైక్ మీద వస్తుండగా ధర్మపురి రోడ్డులో షుగర్ డౌన్ అయ్యి కళ్ళు తిరిగి బైక్ మీద నుండి పడి గాయపడ్డారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం విశాఖలో ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు విజయనగరం రూరల్ ఎస్.ఐ.వి.అశోక్ కుమార్ తెలిపారు. పైడి రాజు కుమార్తె కీర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

యోగాంధ్ర ఆకృతితో వినూత్న ప్రదర్శన

ప్రజాశక్తి- పూసపాటిరేగ

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని పసుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో శుక్రవారం విద్యార్థులు ఒక వినూత్న ప్రదర్శన చేపట్టారు. నేలపై వివిధ రంగుల దుస్తులు ధరించి, ఒక ఆధునిక కళాకృతిలా 'యోగాంధ్ర' ఆకృతిని తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. నాగేశ్వరరావు నేతృత్వం వహించగా, ఉపాధ్యాయులు, స్థానిక పెద్దలు భాగస్వాములయ్యారు. విద్యార్థులు రంగుల దుస్తులలో రకరకాల యోగాసనాల్లో కూర్చుని, తెలుపు రంగు గీతల మధ్య యోగాంధ్ర ఆకృతిని ఎంతో అద్భుతంగా ప్రదర్శించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని యోగాను ప్రతి రోజు జీవితంలో భాగంగా చేసుకోవాలని ఉపాధ్యాయులు ప్రసంగించారు. పాఠశాల ఆవరణలో ప్రాచుర్యం పొందిన ఈ కార్యక్రమం యోగాపట్ల అవగాహన పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషి పోషించింది.

యోగా విజయవంతానికి కృషి చేయాలి

గంట్యాడ: ఈ నెల 21వ తేదీన విశాఖపట్నంలో జరగనున్న యోగా కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కార్యాలయంలో జరిగిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 10 సంవత్సరాలుగా యోగా కార్యక్రమాలను జరిపిస్తున్నారని అన్నారు. ఐక్య రాజ్యసమితి అనుమతితో కుల, మతాలకు అతీతంగా ప్రపంచమంతా జరిపించడానికి ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని ఆయా నాయకులు అధికారులు బాధ్యత వహించి యోగాను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కొండపల్లి భాస్కర్‌నాయుడు, కొప్పలవలమ్మ సాధికారిక రాష్ట్ర నాయకులు అల్లు విజయ్‌కుమార్, ఎంపిడిఒ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: యోగా ఆకృతిలో విద్యార్థులు

యోగాంధ్రలో విద్యార్థులకు అల్పాహారం తప్పనిసరి

రేగిడి: యోగాంధ్రలో విద్యార్థులకు అల్పాహారం తప్పనిసరి చేయాలని ఎంపిడిఒ శ్యామల కుమారి సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఎంఇఒలు వర ప్రసాదరావు, ఎరకయ్య, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 11వ జాతీయ యోగా దినోత్సవాన్ని ఉదయం 6 గంటలకు ప్రారంభించాలని అందుకు యోగాలో పాల్గొన్న పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్నం భోజన పథకం నిర్వాహకులతో ఉప్మా వండించి ఉదయం ఎనిమిది, తొమ్మిది మధ్య అల్పారంగా అందించాలని చెప్పారు.

ఆర్ ఆముదాలవలస కాలనీ పాఠశాలలో తనిఖీ

ఆర్.ఆమదాలవలస కాలనీ పాఠశాలలో ఎంఇఒలు ఎంవి ప్రసాద్‌రావు, బి.ఎర్రకయ్య తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం పనితీరు, వేడి వంటకాలు పరిశీలించారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జెమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహణ పరిశీలించారు. డాక్టర్ ఎన్ పవన్ సాయి ఎండి జనరల్ మెడిసిన్ డాక్టర్ వై అప్పలకొండ, ఆప్తమాలజీ డాక్టర్ కే దీప బిపిటి తదితర డాక్టర్లు పిల్లలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. ప్రతిరోజు పిల్లలకు క్రీడలు ఆడటం వల్ల శారీరకమైన వ్యాధులు రావని ఆరోగ్యకరంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాలవలస రమేష్ కుమార్ ఎన్ రమాదేవి ఉన్నారు.

డెంకాడ: జూన్ 21వ తేదీ ప్రపంచయోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని జొన్నాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు శశాంక్ ఆసనం ద్వారా యోగా నమూనా ఆకృతిని నిర్మించారు. ఈ చిత్రం ద్వారా ప్రపంచంలో అందరికీ కూడా యోగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.లక్ష్మీ, పిఇటి పి.లీలా కృష్ణ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



డెంకాడ: యోగా ఆకృతిని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

యోగాను విజయవంతం చేయాలి

నెల్లిమర్ల: వైజాగ్‌లో జరగనున్న యోగాంధ్ర కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిడితో కలిసి కేడర్ మొబిలైజేషన్ కోసం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, బొంతు వెంకటరమణ, గరికిపేట మాజీ సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యోగా...జీవన విధానం కావాలి

బొబ్బిలి: 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్రను విజయవంతం చేయాలని రోటరీ, కారుణ్య సంస్థల చైర్మన్ జెసి రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం రోటరీ కార్యాలయ ఆవరణలో సభ్యులకు యోగాపై అవగాహన...ఆసనాలపై అవగాహన కల్పించారు. ప్రశాంత జీవన విధానానికి యోగాను ఆచరించాలన్నారు. శనివారం నిర్వహించనున్న యోగా కార్యక్రమాల్లో పాల్గొని యోగాంధ్రను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు శ్రీనివాసన్, కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ప్రెసిడెంట్ ఎలెక్ట్ శ్రీహరి, రామకృష్ణ, కృష్ణమోహన్, శివకాంత్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపకరణాలు పంపిణీ

ప్రజాశక్తి- బాడంగి

స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మండలంలోని వికలాంగ పిల్లలకు శుక్రవారం ఉచితంగా ట్రై సైకిల్స్, వీల్ చైర్స్, వినికిడి యంత్రాలు మండల విద్యా శాఖాధికారి రాజేశ్వరి,హెచ్‌ఎం దత్తి సత్యన్నారాయణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పెషల్ ఎడ్యుకేటర్ కొల్లి ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం, వికలాంగులకు ఎస్కార్ట్, రవాణా భత్యం, రీడర్ ఆలవెన్సు, బాలికలకు స్టయిఫండ్, ఉచిత ఉపకరణాలు, స్కాలర్‌షిప్స్, ఫిజియోథెరపీ, పెన్షన్, పరీక్షలో రాయితీలు విద్యా, ఉద్యోగ రిజర్వేషన్స్ సౌకర్యాలను కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఐఇఆర్‌పిలు సరిత, సత్యన్నారాయణ, ఉపాధ్యాయులు రమేష్, రామారావు, తిరుపతి, శ్రీను పాల్గొన్నారు.

జగన్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి- చీపురుపల్లి

గ్రామంలో వార్డు సభ్యునిగా పోటీ చేయాలనుకునే వ్యక్తి కూడా తన నడవడికతో ప్రజలను ఆకట్టుకోవాలని చూస్తారని.. మంచీ చెడులను గ్రహించి, మంచి చేయాలనే అనుకుంటారని టిడిపి జిల్లా అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీరు చాలా అధ్వానంగా ఉందని.. ఏ నాయకుడూ మాట్లాడని భాష, ఎవరూ సమర్థించని వైఖరిని ప్రోత్సహిస్తున్నారని అన్నారు. శుక్రవారం చీపురుపల్లిలో తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. జగన్ పర్యటనలో ఒక సైకో యువకుడు రప్పా రప్పా నరికేస్తామని ప్లకార్డులు ప్రదర్శిస్తే.. ఖండించాల్సింది పోయి, సమర్థిస్తారా? అని నాగార్జున ప్రశ్నించారు. 'అసలు జగన్‌కు ఒక పార్టీని నడిపే అర్హత ఉందా? యువతకు మీరిచ్చే సందేశం ఏమిటి? మీ మాటలను చూసి యువకులు చెడిపోతే ఎవరు బాధ్యత వహిస్తారు? నాయకుడు ప్రవర్తించే తీరు ఇదేనా?' అని నిలదీశారు. ఆ మాటలను వెనక్కి తీసుకొని, ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు జగన్ క్షమాపణ చెప్పాలని నాగార్జున డిమాండ్ చేశారు.

యోగాడేను విజయవంతం చేద్దాం

యోగా, ధ్యానం చేస్తే కచ్చితంగా అందరి జీవితాలూ బాగుంటాయని నాగార్జున అన్నారు. ఇది నమ్మే ప్రజలందరూ యోగా, ధ్యానం అలవర్చుకోవాలని విశాఖలో ఈనెల 21న పెద్ద ఎత్తున యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇది గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించుకునే బృహత్తర కార్యక్రమమన్నారు. యోగా దినోత్సవం విజయవంతం చేసే బాధ్యతను కూటమి నాయకులు, కార్యకర్తలు తమ భుజాన వేసుకొని.. ఎక్కువమంది ప్రజలు భాగస్వామ్యం అయ్యేలా చూడాలని కోరారు.

వైసిపి.. సైకోలను తయారు చేసే ఫ్యాక్టరీ

ప్రజాశక్తి- కంటోన్మెంట్



వైసిపి సైకోలను తయారు చేసే ఫ్యాక్టరీగా తయారైందని తెలుగు మహిళా సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ రెడ్డిపల్లి ఉషారాణి ఒక ప్రకటనలో విమర్శించారు. రప్పా రప్పా పొట్టేళ్లను నరికినట్లు నరుకుతారా జగన్ గారు? అని ప్రశ్నించారు. మీ అభిమానుస్తుడి భాషను మీరు సమర్థించడం దేనికి సంకేతమని, ప్రజాస్వామ్యానికి మీ ధోరణి చాలా ప్రమాదకరమని అన్నారు. ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా వైసిపి పద్ధతి మారలేదని పేర్కొన్నారు. ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేసే విధంగా వ్యవహరించడం దారుణమని తెలిపారు. ప్రజా పాలనలో ఇటువంటి చర్యలను ఉపేక్షించమని హెచ్చరించారు. అమరావతి రాజధాని ప్రాంత మహిళలను వేశ్యలు అంటూ ప్రచారం చేసి, డిబేట్లు పెట్టిన సాక్షి ఛానల్ పై చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్రం మొత్తం మహిళలందరూ ఆగ్రహావేశాలతో నిరసన తెలియజేసినందుకు. నైతిక బాధ్యత వహించి జగన్ భార్య వైయస్ భారతి రెడ్డి మహిళలకు క్షమాపణలు చెప్పలేదని తెలిపారు. అహంకార ధోరణి ఇలాగే కొనసాగితే మహిళ లోకం అస్సలు క్షమించదని తెలిపారు.

ఎన్ఇపితో ప్రభుత్వ విద్య దూరం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

నూతన విద్యావిధానం వల్ల పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి రాము ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ 18వ అఖిలభారత మహాసభ సందర్భంగా భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్‌కోట మండల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని వివేకానంద కళాశాలలో శుక్రవారం విద్యపై సదస్సు నిర్వహించారు. ముందుగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రమేష్ ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు రాము మాట్లాడుతూ, విద్యారంగ సమస్యపై ఎస్ఎఫ్ఐ నిరంతరం అలుపెరగని పోరాటం చేస్తుందని కేంద్రం ప్రభుత్వం ఇటీవల తెచ్చిన నూతన విద్యా విధానం వల్ల పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఉందని అన్నారు. చదువు అనేది దేశ అభివృద్ధికి తోడ్పడే విధంగా ఉండాలి కానీ దేశ అభివృద్ధిని వెనక్కి నెట్టే విధంగా ఉండకూడదని, కేంద్ర ప్రభుత్వం నూతన విద్య విధానాలను వెనక్కి తీసుకోవాలని సూచించారు. జిల్లాలో సంక్షేమ హాస్టల్ గాని, గజపతినగరం, విజయనగరం, చీపురుపల్లి ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలు రావడానికి ఎస్ఎఫ్ఐ పోరాట ఉద్యమాలలో కీలక పాత్ర పోషించి విజయం సాధించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వి.చిన్నబాబు, మండల నాయకులు రవి, నాయుడు, రూతు వివేకానంద, ఎజిఎల్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాము

'తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు'

ప్రజాశక్తి- గంట్యాడ

తాటిపూడి రిజర్వాయర్ నుంచి నీటిని జిందాల్ కంపెనీకి తరలించడానికి సిద్ధంగా ఉన్నారన్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని తాటిపూడి ఆయకట్టు సంఘం నాయకులు అన్నారు. తాటిపూడి రిజర్వాయర్ వద్ద ఆయకట్టు సంఘం నాయకులు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం పాలన చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నారని అన్నారు. మంత్రి శ్రీనివాస్ జిందాల్ కంపెనీకి తాటిపూడి నీరును తరలించడానికి సిద్ధంగా ఉన్నారని ఇటీవల పేపర్లో వచ్చిన వార్తలు నిజమైనవి కావన్నారు. వైసిపి ప్రభుత్వంలో అప్పటి మంత్రులు అల్యూమినియం ఫ్యాక్టరీకి నీరు ఇవ్వడానికి ప్రయత్నాలు చేశారని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో దీని గురించి మంత్రులు గాని నాయకులు గాని ఎటువంటి ప్రయత్నం చేయలేదన్నారు. రిజర్వాయర్‌ను రక్షించుకొవాల్సిన బాధ్యత తమపై ఉందని నీటి సంఘం అధ్యక్షులు అన్నారు. తాటిపూడి ఆయకట్టు రైతులకు అన్యాయం జరిగితే మంత్రి శ్రీనివాస్ ఊరుకోరని అన్నారు. మంత్రి పాలనను చూసి ఓర్వలేక రైతులలో గొడవలు పెట్టడానికి చూస్తున్నారని ఆరోపించారు. ఆయకట్టు సభ్యులుగా ఎస్.కోట ఎమ్మెల్యేను చేర్పించాలని కోరుతున్నామని అన్నారు. దీనిపైన రైతు సంఘం అధ్యక్షులు, నెంబర్లు అంతా కలిసి మంత్రిని కలిసి చర్చిస్తామని అన్నారు. సాగునీటి ప్రాజెక్టుగా ప్రకటించమని కోరుతామని అన్నారు. ఈ సమావేశంలో అల్లు విజయకుమార్, టిడిపి మండల అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు, తాటిపూడి రిజర్వాయర్ ఆయకట్టు సంఘం అధ్యక్షులు కె.జగన్నాథం, గోపిశెట్టి రమేష్, రావాడ రామచంద్రరావు, గులిపిల్లి లక్ష్మణ, బోనం నారాయణరావు, రొంగలి మురళీధర్, సిరికి చలం నాయుడు, నీటి సంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు.

23న వైసిపి యువత పోరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మోసగించినందుకు నిరసనగా ఈనెల 23న యువతపోరు పేరిట నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు వైసిపి వైసిపి యువజన విభాగం నాయకులు మజ్జి సిరి సహస్ర(సిరిమ్మ), జిల్లా పార్టీ యువజన విభాగ అధ్యక్షులు అల్లు అవినాష్, విద్యార్థి విభాగ అధ్యక్షులు కరుమజ్జి సాయి కుమార్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం వైసిపి కార్యాలయంలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. వాలంటీర్లకు రూ.10వేలు ఇస్తామని చెప్పి విధుల నుంచి తొలగించారన్నారు. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి మోసగించిందన్నారు. ఈనేపథ్యంలో తలపెట్టిన నిరసన కార్యక్రమంలో యువత పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

బిజెపి ఎమ్మెల్యేపై చర్య తీసుకోండి : సిపిఎం

ప్రజాశక్తి - బొబ్బిలి

కర్నూలు జిల్లా ఆదోని బిజెపి ఎమ్మెల్యే ఒక అధికారిక కార్యక్రమంలో దళిత సర్పంచ్ చంద్రశేఖర్‌ను స్టేజ్ పైకి పిలవకుండా అవమానించడం దారుణమని స్టేజ్ పైన తన పక్కనున్న వారు ఆ సర్పంచ్ ఎస్‌సి వాడని చెప్పగానే తన కాళ్ల దగ్గర కూర్చోమనడం సిగ్గుచేటని ఇంతకంటే అవమానం మరొకటి లేదని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. శంకర్రావు అన్నారు. పట్టణంలో బిజెపి ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనువాద సిద్ధాంతం నర నారాణ ఈ ఎమ్మెల్యేకి ఎక్కి పోయిందన్నారు. రాజ్యాంగ బద్ధంగా ప్రమాణం చేసిన ఈ ఎమ్మెల్యే కుల వివక్షత ఎలా చూపిస్తాడని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఆదోని ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ నాయకులు ఎం.ప్రసాదు జి. గౌరీ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

అన్నదాతకు అన్యాయం చేయొద్దు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అన్నదాత సుఖీభవ పథకంలో నిబంధనలు పేరిట రైతులకు అన్యాయం చేయడం దుర్మార్గమని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయడానికి నిబంధనల పేరిట అన్నదాతకు అన్యాయం చేయడం తగదన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన భూ సమగ్ర సర్వేతో ఇప్పటికీ రైతులు ఇబ్బందులు పడి సంక్షేమ పథకాలకు నోచుకోలేక పోతున్నారని తెలిపారు. సర్వే తప్పులు తడకగా మారి రైతులకు లేని భూమిని ఎక్కువగా చూపించడం, జిరాయితీ భూములు ప్రభుత్వ భూములుగా నమోదు కావడం వల్ల అన్నదాత సుఖీభవ పథకం పొందలేకపోతున్నారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం వాటిని చూపించి నిబంధనలు పేరిట రైతుకి సుఖీభవ పథకం అమలు చేయనంటే ఎలా అని ప్రశ్నించారు. రీసర్వేలో జరిగిన తప్పులు సరి చేయమని రైతులు విన్నవించుకున్నా పట్టించుకునే నాధుడు లేడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిబంధనలు పేరిట పథకాన్ని నిర్వీర్యం చేయకుండా రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.